మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



# రోడ్లపై ధాన్యాన్ని పోయొద్దు..

**ప్రమాదాలకు కారణం కావొద్దు : ఎస్పీ డి.జానకి**



రోడ్లపై ప్రమాదకరంగా ధాన్యాన్ని పోసిన దృశ్యం

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు రోడ్లపై ధాన్యాన్ని పరచుకునే విధానంపై ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. సాధ్యమైనంత వరకు రోడ్లపై ధాన్యాన్ని ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డి.జానకి కోరారు. అతివేగంగా రోడ్లపై ప్రయాణించే వాహనాలు, రోడ్లపై పెట్టిన ధాన్యం గుట్టలను గమనించలేక, ప్రమాదాలకు దారితీస్తున్నాయని వివరించారు. ప్రత్యేకంగా రాత్రి సమయంలో రోడ్లపై ధాన్యాన్ని ఉంచి, నల్ల కవర్ కప్పడం వల్ల ధాన్యం కుప్ప కనబడక, వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటువంటి ఘటనలు మానవ ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని, గతంలో ఈ విధంగా చాలామంది ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటనలు జరిగినట్లు ఆమె తెలిపారు. ప్రజలకు పలు సూచనలు జారీ చేశారు. 1.ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయడాన్ని నియంత్రించుకోవాలి 2.కర్షకులు ధాన్యం ఎండబెట్టే సమయాల్లో రోడ్లపై కాకుండా ఇతర సముచిత ప్రదేశాలను ఉపయోగించుకోవాలి 3.అత్యవసరంగా రోడ్లపై ధాన్యం ఉంచాల్సి వచ్చినపుడు స్పష్టమైన గుర్తింపు కోసం అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి 4.రోడ్లపై ధాన్యాన్ని ఉంచితే, ప్రమాదాలకు కారణమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గుర్తుంచుకోవాలన్నారు.

**సాగునీటి కోసం జూరాల ప్రాజెక్టు**

# రహదారిపై రైతులు ధర్నా

**రెండు గంటల పాటు ధర్నాతో భారీగా ట్రాఫిక్ జామ్**




జూరాల ప్రాజెక్టుపై భారీగా ట్రాఫిక్ జామ్

**అమరచింత, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆయా గ్రామాల రైతులు మంగళవారం మండలంలోని జూరాల ప్రాజెక్టుపై రైతులు రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, యాసంగిలో వరి పంటలు వేసుకున్న రైతులకు సాగునీరు ఇస్తామని హామీతో పంటలు వేసుకుంటే ప్రభుత్వం జూరాల ప్రాజెక్టు నుండి సాగునీటి విడుదల లేకపోవడంతో వేసుకున్న వరి పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులకు సాగు నీరుని విడుదల చేసి రైతులను కాపాడాలని వివిధ గ్రామాల రైతులు అధికారులను కోరారు. జూరాల ప్రాజెక్టుపై సాగునీటి విడుదల కోసం రైతులు చేస్తున్న ధర్నా వల్ల గద్వాల్, ఆత్మకూర్, నారాయణపేట వెళ్లే వాహనాలు ప్రాజెక్టుపై భారీగా నిలిచాయి. జూరాల ప్రాజెక్టుపై ధర్నాను విరమించాలని అనేకమార్లు ఆత్మకూరు సిఐ, శివకుమార్, అమరచింత ఎస్సై, సురేష్ రైతులను కోరారు. జిల్లా కలెక్టర్ ప్రాజెక్టు దగ్గరకు వచ్చి రైతులకు సాగునీరు విడుదల చేస్తామని హామీ ఇచ్చేవరకు ధర్నా విరమించమని రైతులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు ఏఈ, ధర్నా దగ్గరకు చేరుకొని డిఈ కి సమాచారం ఇచ్చారు. జిల్లా కలెక్టర్ తో మాట్లాడి రైతులకు సాగు నీరు విడుదలకు ప్రయత్నిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం రైతులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు భారీగా పాల్గొన్నారు.

**కస్తూర్బా విద్యార్థిని**

# ఆత్మహత్యాయత్నం

**ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని**

**కోయిలకొండ, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన కోయిలకొండలో గల కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయం లో 9వ తరగతి చదువుతున్న యోగేశ్వరి అనే విద్యార్థిని సోమవారం యాసీడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉపాధ్యాయులు తెలిపిన వివరాలు కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో కళాశాల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. అక్కడ పని చేసే కూలీల ఫోన్లు రావడంతో ఆ ఫోన్లు ఎత్తడానికి యత్నించిన ఆ విద్యార్థినిని అక్కడి ఉపాధ్యాయులు మందలించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థిని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డ సమయంలో పాఠశాల ప్రత్యేక అధికారి అందుబాటులో లేకపోవడం ఏమిటని పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం పాఠశాలను సందర్శించి పాఠశాలలో జరిగిన విషయం గురించి తెలుసుకోవడా నికి దళిత సంఘాల నేతలు పాఠశాల ప్రత్యేక అధికారికి ఫోన్ చేసిన స్పందించడం లేదని దళిత సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**విద్యార్థిని ఆరోగ్యం మెరుగ్గా ఉంది.....** పాఠశాల ప్రిన్సిపల్ హారిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థిని ఆరోగ్యం బాగుందని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్ని రకాల వైద్య చికిత్సలు చేశామని పాఠశాల ప్రిన్సిపల్ హారిక తెలిపారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలి : కలెక్టర్

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** అర్హత కలిగిన వారికి ఖచ్చితంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చే యాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. నియోజకవర్గానికి ఓ ప్రత్యేక అధికారిని నియమించడం జరుగుతుందని,ఆప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో అర్హుల ఎంపిక పారదర్శకంగా చేయాలనీ, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చేటట్లు చూడాలన్నారు. నియోజకవర్గానికి కేటాయించిన 3500 ఇందిరమ్మ ఇండ్లను అర్హులందరికీ వచ్చేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. అనంతరం భూ భారతిపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికా రులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ బెంషాలం, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ ఆర్‌డిఓ రాంచందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

**మూడు గంటలు..**

# కాలినడకన..

**ఉదండపూర్ పునరావాస కేంద్రం పనులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి**

**సమీక్షించిన కలెక్టర్ విజయేంద్ర బోయి.. పనులు వేగవంతం చేయాలని ఆదేశం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** ఉదండపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురైన నిర్వాసితులకు పునరావాస కేంద్రంలో మౌలిక సదుపాయాల పనులను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గ్రామాల వారీగా పునరావాస కేంద్రంలో మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జడ్చర్ల మండలం దేవుని గుట్టతండా వద్ద రేగడి పట్టి తండా, చిన్న గుట్ట తండా ,వల్లూరు, ఉదండపూర్, తుమ్మల కుంట తండా, ఒంటి గుడిసె తండా ముంపు గ్రామాల నిర్వాసితులకు లోకేషన్ 1,2 ప్రాంతాల్లో చేపట్టిన పనులను రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, అర్‌డిఓ, ఇంజినీరింగ్ అధికారులు,కాంట్రాక్టర్ లతో కలిసి సుమారు మూడు గంటల పాటు కాలినడకన ఎండ తీవ్రతను లెక్క చేయకుండా పునరావాస కేంద్రంలో కలెక్టర్ స్వయంగా పనుల ప్రగతిని పరిశీలించి సమీక్షించారు.పునరావాస కేంద్రం లోకేషన్ 1 లో రేగడిపట్టి తండా, చిన్న గుట్టతండా ముంపు గ్రామాల నిర్వాసితులకు 151 ప్లాట్‌లలో చేపట్టిన మిషన్ భగీరథ త్రాగు నీరు సరఫరా పైపు లైన్, ట్యాంక్‌ల నిర్మాణ పనులు, డ్రైన్స్, విద్యుత్ పనులు పూర్తి చేయడం జరిగినట్లు అధికారులు వివరించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడి కేంద్రం నిర్మాణం చేయనున్న స్థలం పరిశీలించారు. మిగిలిన పనులు వెంటనే పూర్తి చేసి నిర్వాసితులకు ప్లాట్ లు కేటాయింపు చేయడానికి సిద్ధం చేయాలని అన్నారు. పునరావాస కేంద్రం లోకేషన్ 2లో వల్లూరు, ఉదండపూర్, తుమ్మల కుంట తండా, ఒంటి గుడిసె తండా, శామగడ్డ తండా ముంపు గ్రామాల నిర్వాసితులకు చేపట్టిన పనుల ప్రగతి పరిశీలించారు పనులు పురోగతిలో వాటిని సమీక్షించారు. పనుల ప్రగతి ప్రతి వారం కలెక్టర్ కార్యాలయంలో సంబధిత అధికారులతో నిర్వహించే సమావేశాల్లో సమీక్షించి పనుల ప్రగతి ఎంత వరకు చేశారు. చేయ వలసిన పనులు గురించి క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో అధికారులతో సమీక్షిస్తూ పనుల ప్రగతిలో మందగతిలో ఉంటే అధికారులను మందలించి సూచనలు ఇస్తూ పనులను అత్యంత ప్రాధాన్యత నిచ్చి వేసవిలో పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్వాసితుల సమస్యలు విని పరిష్కారం చేస్తానని సూచించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు,స్పెషల్ కలెక్టర్ మధుసూదన్, ఆర్‌డిఓ నవీన్, ఇరిగేషన్ ఎస్ఈ చక్రధరం, మిషన్ భగీరథ ఎస్ఈ జగన్మోహన్,సర్వే లాండ్ రికార్డ్స్ ఏడి కిషన్‌రావు, ఇరిగేషన్ ఈఈ లు జె.రమేష్, ఉదయ్ కుమార్, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ పుల్లారావు, మౌలిక విధ్య సదుపాయాల సంస్థ ఈఈ రాం చందర్, జడ్చర్ల తహశీల్దార్ నర్సింగ రావు, డిఈలు, ఏఈలు తదితరులు ఉన్నారు.



పునరావాస కేంద్రంలో పండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**ఆ టీచర్‌ను సస్పెండ్ చేస్తేనే...**

# మేము భోజనం చేస్తాం

**- మేడం టార్చర్లు భరించలేము - ఆందోళనకు దిగిన కస్తూర్బా విద్యార్థులు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** విద్యాబుద్ధులు నేర్పి విద్యార్థుల పాలిట దైవంగా నిలువాల్సిన ఉపాధ్యాయులు నేటి సమాజంలో వారి వింత ప్రవర్తనలతో విద్యార్థుల పాలిట భూతంలా మారి వారి పట్ల ప్రవర్తిస్తున్న తీరు చూస్తుంటే విద్యార్థులను పాఠశాలలకు పంపించాలంటే తల్లిదండ్రులు భయాందోళన చెందాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా నాగనూల్ కస్తూర్బా విద్యాలయంలో ఒక ఉపాధ్యాయురాలు తీరుతో విద్యార్థినులు విసిగి వేజారి ఉపాధ్యాయురాలు తీరును నిరసిస్తూ నిరసన గళమెత్తిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మేడం టార్చర్లు భరించలేమని ఉద్దేశపూర్వకంగానే తమను అన్ని విధాల ఇబ్బందులకు గురి చేస్తున్న ఉపాధ్యాయురాలను సస్పెండ్ చేస్తేనే మేము భోజనం చేస్తామని కస్తూర్బా విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు వివరాల్లోకి వెళితే మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా నాగనూల్ కస్తూర్బా విద్యార్థినులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ తమ భవిష్యత్తు బాగుండాలని తల్లిదం డ్రులు కస్తూర్బా పాఠశాలలో తమని చదివిస్తున్నారని దానికి విరుద్ధంగా ఇక్కడున్న ఉపాధ్యాయురాలు తమపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ తమను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయురాలు టార్చర్ కారణంగా సరిగ్గా చదవలేక పోతున్నామని ఇలాంటి ఉపాధ్యాయురాలుపై చర్యలు తీసుకోకపోతే తమ భవిష్యత్తు అంధకారమవుతుందని విద్యార్థులు తెలిపారు. స్టడీ అవర్స్‌కు ఆలస్యంగా వచ్చావని 9వ తరగతి విద్యార్థినికి ఇంగ్లీష్ టీచర్ మూడు గంటల పాటు పనిష్మెంట్ ఇవ్వడం.. ఈ విషయము మీడియాలో రావడంతో అధికారులు ఇటీవల విచారణ చేశారు. దీనితో ఉపాధ్యాయురాలు మాపై కక్ష్య పెట్టుకుని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపిస్తూ విద్యార్థులు మరోసారి ఆందోళన చేపట్టారు. ఆ ఉపాధ్యాయురాలను సస్పెండ్ చేసే వరకు మేం భోజనం చేసేదే లేదంటూ భీష్మించుకో కూర్చొని ఆందోళన చేస్తున్నారు. విద్యార్థులకు పలువురు నచ్చే చెప్పే ప్రయత్నం చేసిన వినకుండా వారు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

# ప్రత్యామ్నాయం బీజేపీనే

- కాంగ్రెస్ పాలనలో దేనికి గ్యారెంటీ లేదు
- ఉచిత బస్సులతో ఉన్న బస్సులు తీసేస్తున్నారు
- నారాయణపేట జిల్లా కన్మనూరులో ఎంపీ డీకే అరుణ పర్యటన
- పార్టీ జెండా ఆవిష్కరణ.. నూతనంగా ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్లు ప్రారంభం



ఎంపీకి జ్ఞాపికను అందజేస్తున్న నాయకులు కార్యకర్తలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** ఓట్లకోసం... సీట్ల కోసమే కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోందనీ, తెలంగాణ, కర్నాటక తప్ప దేశంలో ఎక్కడా కాంగ్రెస్ పార్టీ లేదని తెలంగాణలో ప్రత్యామ్నాయం బిజెపినే అని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ధీమా వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లా మరికల్ మండలం కన్మనూరు గ్రామంలో ఆమె పర్యటించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఐమాస్ట్ లైట్లు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశంలో మోదీ నాయకత్వాన్ని మించిన నాయకుడు లేదని, దేశంలోని అన్ని వర్గాలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. ఇక్కడ ఆరు గ్యాంటీలన్నారు.. కర్నాటకలో ఐదు గ్యారంటీలన్నారు.. వేటికీ గ్యారంటీ లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ అమలు చేయలేదని రూ. 2లక్షల రుణ మాఫీఇవ్వలేదనీ,మహిళలకు రూ.2500 భృతి, ఆడపిల్లలకు స్కూటీలు, పెన్షన్ రూ.4000, తులం బంగారం లేదని విమర్శించారు. ఉచిత బస్ పేరుతో ఉన్న బస్సులు తీసేస్తున్నారని ఆరోపించారు. 2047కల్లా ఈ దేశాన్ని వికసిత్ భారత్ సంకల్పంతో ప్రధాని మోదీ ముందుకు వెళ్తున్నాంని, మోదీకి మనం అంతా అండగా నిలవాలని - మిగతా4లో..

# గడువు పొడిగింపు

**మహబూబ్‌నగర్ లెర్నింగ్ సెంటర్‌కు**

**పార్ట్ టైం అధ్యాపకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం**

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పట్టణంలో పేద విద్యార్థుల కోసం త్వరలో నెలకొల్పనున్న లెర్నింగ్ సెంటర్‌లో 8,9,10 తరగతుల విద్యార్థులకు గణితం,భౌతిక రసాయన శాస్త్రము, జీవ శాస్త్రము సబ్జెక్టులను బోధించేందుకు పార్ట్ టైం అధ్యాపకుల మహబూబ్‌నగర్‌కు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మహబూబ్‌నగర్ అర్బన్ ఎమ్మార్వో శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.ఎంపికైన వారికి నెల రోజుల పాటు డిజిటల్ బోర్డు పైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థులు ప్రతి రోజు సాయంత్రం 3 గంటలపాటు విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాల్సి ఉంటుందన్నారు. అర్హతలను బట్టి వారికి రూ. 15000/ గౌరవ వేతనంగా చెల్లిస్తామని వెల్లడించారు. నిర్ణీత ఫారంలో నింపిన ధరఖాస్తులు బయోడేటాతో పాటు మెట్టుగడ్డ సమీపంలోని మహబూబ్‌నగర్ అర్బన్ ఎమ్మార్వోలో రేపు సాయంత్రం ఐదు గంటల వరకు సమర్పించాలని సూచించారు.

**సబ్ స్టేషన్ కనెక్షన్ ఇవ్వాలని**

# గ్రామస్తులు, రైతుల ధర్నా



సబ్ స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న రైతులు

**పెబ్బేరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం తోమాలపల్లి గ్రామంలోని సబ్ స్టేషన్ కు కరెంటు కనెక్షన్ ఇవ్వాలని తోమాలపల్లి గ్రామ రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం తోమాలపల్లి సబ్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తోమాలపల్లి, రామమ్మపేట, ఏటిగడ్డ శాఖాపూర్ గ్రామాల రైతుల కోసం తోమాలపల్లిలో 33/11 కేవీ సబ్ స్టేషన్ ను నిర్మించి 5 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటి వరకు దానిని ప్రారంభించలేదని చెప్పారు. ప్రస్తుతం ఈ మూడు గ్రామలకు కొత్తకోట మండలంలోని పామాపురం, నాటవెల్లి మీదుగా తోమాలపల్లి సబ్ష్టేషన్ కు కరెంటు అందించాల్సి ఉండగా నాటవెల్లి గ్రామానికి చెందిన ఓ అధికార పార్టీ నేత స్తంభాలు వేకుండా అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్ఈ, డిఈలను కలిసి వినతి పత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సబ్ స్టేషన్ ప్రారంభం కాకపవడంతో ఆయా గ్రామాల్లోని ఇళ్లకు ప్రస్తుతం అందుతున్న కరెంట్ సరిపోవడం లేదని,లో ఓల్టేజీ వస్తుందని అన్నారు. పొలాల దగ్గర మోటార్లు కూడా పనిచేయడం లేదని వాపోయారు. సరైన కరెంటు లేక పొలాలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, హై ఆఫీసర్లు స్పందించి త్వరగా సబ్ష్టేషన్‌ను ప్రారంభించాలని డిమాండు చేశారు. లేనిపక్షంలో ఎస్ఈ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

# కుమారుడి వివాహేతర బంధం... దారుణ హత్యకు గురైన తండ్రి

- నడింపల్లిలో వ్యక్తి దారుణ హత్య
- మారణాయుధాలతో దాడి చేసిన నిందితులు
- అచ్చంపేట-హైదరాబాద్ ప్రధాన రహదారిపై సంఘటన
- హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తుల డిమాండ్

**అచ్చంపేట,ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** ఇద్దరు మధ్య ఉన్న అక్రమ సంబంధం పట్టపగలే ప్రధాన రహదారిపై ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన చోటు చేసు కుంది. గ్రామస్తులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం అచ్చంపేట మండలం నడింపల్లి గ్రామానికి చెందిన బోరం వీరయ్య (53)కు ఇద్దరు కుమారులు. వ్యవసా యమే ఆ కుటుంబానికి జీవనాధారం. వీరయ్య రెండో కుమారుడు పరమేష్ అదే గ్రామానికి చెందిన ఓ మహి ళతో వివాహేతర సంబంధం కొనసాగుతోంది. వీరయ్య కుమారుడు పరమేష్ గ్రామంలో వివాహేతర బంధం పెటుకున్న మహిళను తీసుకొని ఏపీలోని గుంటూరు జిల్లాలోని ఓ గ్రామంలో ఉంటున్నాడు. విషయం తెలు సుకున్న మహిళా కుటుంబ సభ్యులు వీరిద్దరిని తీసుకొ చ్చి గ్రామంలో పంచాయతీ పెట్టారు. ఒకరి వద్దకు మరొకరు వెళ్ళొద్దని గ్రామస్తుల సమక్షంలో రెండు కుటుంబాల వాళ్ళు ఒప్పందం చేసుకున్నారు. మహిళను భర్త దగ్గరకు పంపించారు.



దారుణ హత్యకు గురైన వీరయ్య

**ప్రధాన రహదారిపై దారుణ హత్య**

గ్రామానికి చెందిన మహేష్‌గౌడుతో సదరు మహిళలకు చాలా సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. కాగా కొద్ది రోజుల నుంచి సదరు మహిళతో పరమేష్ సన్నిహితంగా ఉంటున్నాడు. వీరిద్దరి మధ్య పరిచయం కాస్త పెరిగి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ క్రమంలోని కొద్ది రోజుల కిందట వీరిద్దరూ గ్రామం నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత వారిద్దరిని గ్రామానికి తీసుకొచ్చారు. ఆ తర్వాత మహిళ బంధువులు పరమేష్‌పై దాడి చేశారు. దీని గురించి అప్పట్లోనే అచ్చంపేట పోలీసులకు ఫిర్యాదు చేశామని పోలీసులు కేసు పెట్టకుండా నిర్లక్ష్యం వహించారని మృతుని బంధువులు ఆరోపించారు. కాగా మంగళవారం మధ్యాహ్నం భూరం వీరయ్య తన పెద్ద కొడుకు వెంకటేష్, మరో యువకుడు కలిసి తమ ద్విచక్ర వాహనంపై అచ్చంపేట నుంచి గ్రామ సమీపంలోని ఇటుకల బట్టి వద్దకు రాగానే వెనకనుంచి కారులో వీరిని అనుసరిస్తూ వస్తున్న మహేష్‌గౌడ్, అతని బావమరిది శివ, మరో శివలు వీరయ్య వస్తున్న బైకును అచ్చంపేట-హైదరాబాద్ ప్రధాన రహదారిపై వెనుక భాగం నుంచి ఢీకొట్టారు. కారులోని ఉన్నవారు దిగి సుత్తితో వీరయ్య తలపై బలంగా మోదారు. మరొకరు గొడ్డలితో అతని మెడపై బలంగా నరకడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మరణించాడు. తండ్రిపై జరుగుతున్న దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన వెంకటేష్‌పైన కూడా దాడి చేశారు. అతను భయంతో పెద్దగా కేకలు వేయడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

**గ్రామస్తుల ఆందోళన**

వీరయ్యను హత్య చేసిన ముగ్గురు నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ గ్రామస్తులు, మృతుని బంధువులు సంఘటన జరిగిన ప్రదేశంలోని ఆందోళనకు దిగారు. రహదారికి ఇరువైపులా కర్రలను వేసి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. సంఘటన స్థలానికి అచ్చంపేట డిఎస్పి శ్రీనివాసులు, సిఐ రవీందర్, ఎస్సై రమేష్ - మిగతా4లో..

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతుంది

◆ మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు మెంటేపల్లి పురుషోత్తంరెడ్డి





ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమంలో పాల్గొన్న పురుషోత్తం రెడ్డి

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు గణనీయంగా తగ్గుతుందని మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మెంటెపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను అంగన్‌వాడి సెంటర్ ను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, ప్రభుత్వ పాఠశాలలో సుశిక్షులైన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ రోజు రోజుకు పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నదనీ, ఈ పరిణామం రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు మూతపడే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని పిల్లల తల్లిదండ్రులకు చైతన్య పరిచి, ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు చేరే విధంగా ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, గ్రామీణ పాఠశాలలను కాపాడవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేలు,ఎంపీలు మంత్రులు వారి సామాజిక బాధ్యతగా స్వీకరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు.అంగన్వాడి సెంటర్లలో కూడా పిల్లలను చేర్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన సూచించారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ఉప్పునుంతల, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఉప్పునుంతల శాఖ పరిధిలో అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ సూచనల మేరకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా సహకార అధికారి, నాగర్ కర్నూల్ జిల్లా సివిల్ సప్లై అధికారుల ఆదేశాల మేరకు మండలంలో 9 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు, సంఘ సిఇఒ కొత్త రవీందర్ రావులు తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉప్పునుంతల, కొరటికల్, వెల్టూర్, మర్రిపల్లి, ఉప్పరిపల్లి, లక్ష్మాపూర్, దాసర్లపల్లి, మొల్గర, జప్తి సదగోడు గ్రామాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని వారు వివరించారు.ఈ కేంద్రాల పరిధిలోని గ్రామాల రైతులు వరి కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన వరి ధాన్యాన్నితీసుకొచ్చి ప్రభుత్వం నిర్ణయించిన విధంగా నాణ్యత ప్రమాణాలు పాటించి సిబ్బందికి సహకరించాలని వారు కోరారు. అదేవిధంగా క్లస్టర్ పరిధిలోని మండల విస్తీర్ణాధికారులచే సాగు ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంక్ అకౌంట్ (రైతు భరోసా డబ్బులు పడే అకౌంట్ మాత్రమే) జిరాక్స్ కాపీలను తీసుకొని మొబైల్‌కు ఓటిపి వచ్చే మొబైల్ అందుబాటులో ఉండేటట్లు చూసుకోవాలని వారు వివరించారు.

## రైతులు ఒడ్లు అమ్మేటప్పుడు పట్టాదారు పాసు బుక్కు, ఆధార్ కార్డు తీసుకొని రావాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**మద్దూర్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా ఉమ్మడి మద్దూరు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉమ్మడి మద్దూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరసింహ,కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్దు బీములు ప్రారంభత్స వాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రతి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందని ఈ సందర్భంగా వారన్నారు. పల్లె గడ్డ తండా, దోరేపల్లి, చెన్నారెడ్డిపల్లి, అప్పిరెడ్డిపల్లి, రేణువట్ల, బూనీడు, గోకుల్ నగర్, చిన్వార్, కొత్తపల్లి వివిధ గ్రామాల్లో రైతు కొనుగోలు కేంద్రాల్లో ప్రారంభించారు. రైతులు ఒడ్లు అమ్మేటప్పుడు పట్టాదారు పాసు బుక్కు ఆధార్ కార్డు ఖచ్చితంగా తీసుకొనిరావాలని ఈ సందర్భంగావారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం నారాయణ, మహిళా సంఘాల మహిళామణులు, కొత్తపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, అల్లిపురం మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి, ఉమ్మడి మద్దూరు మాజీమండల జడ్పిటిసి రఘుపతి రెడ్డి, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలింపు : కేసు నమోదు చేసిన పోలీసులు

**ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మల్కిమియాన్ పల్లి పిల్లి వాగు నుండి గత కొన్ని రోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా అర్ధరాత్రి వేళ ఇసుకను తరలిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు స్పెషల్ బ్రాంచ్ పోలీసు వారికి విషయం తెలియడంతో సోమవారం అర్ధరాత్రి వేళ కాపు కాచి మూడు బెంజ్ టిప్పర్లు ఒక మినీ డీసీఎం హిటాచిని పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. ఈ వాహనాలపై స్థానిక ఎస్సై సురేష్ గౌడ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**కల్వకుర్తి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో కల్వకుర్తి పట్టణానికి చెందిన 27 మంది లబ్దిదారులకు రూ.9లక్షల విలువ చేసే సీఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డిలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎంఆర్ఎఫ్ చెక్కులు పేద మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్యానికి రక్షణ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు గోరటి శ్రీనివాసులు, చిన్న, హన్మనాయక్, రవి, చిత్తరి శ్రీను, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, రేష్మ, నాయకులు పుస్తకాల రాహుల్, మిరియాల దామోదర్ రెడ్డి, పాండు రంగా రెడ్డి, శంకర్ నాయక్, కేశవులు, ప్రవీణ్, విక్కీ భాయ్, పడకంటి వెంకటేష్, దున్న సురేష్, శ్రీశైలం, పరశురాం, శివ, లబ్ది దారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు అందజేత

**పెబ్బేరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ అభ్యాస్ అకాడమీ ప్రతి ఏట నిర్వహించే రాష్ట్రస్థాయి ఒలంపియాడ్ పరీక్షలలో పెబ్బేర్ మాస్టర్ మైండ్స్ హై స్కూల్ కు చెందిన పలువురు విద్యార్థులు రామన్ సైన్స్ మహోత్సవ్, రామానుజన్ మ్యాత్స్ మహోత్సవ్ ,బోస్ మెడికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ,ఠాగూర్ ఇంగ్లీష్ ఆప్టిట్యూడ్ టెస్టు, ఆర్యభట్ట మెంటల్ ఎబిలిటీ టెస్ట్ లలో రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సొంతం చేసుకున్నారు. అలాంటి విద్యార్థులను డిఆర్‌డిఓ డైరెక్టర్ డాక్టర్ జి .సతీష్ రెడ్డి, ఐఏఎస్ ఆఫీసర్ జనార్దన్ రెడ్డి మొమెంటులో సత్కరించి అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బెస్ట్ ఒలంపియాడ్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతొ పాఠశాల కరస్పాండెంట్ లావణ్య రంగారెడ్డి ని ఘనంగా సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాలఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గన్ని సంచుల అందజేతలో విఫలం

**మక్తల్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** ప్రస్తుత రబీ సీజన్‌కు సంబంధించి రైతులు పండించిన వడ్లను విక్రయించుకునేందుకు గన్నీ సంచులు లభించక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిఆర్ఎస్ మక్తల్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు గవినోళ్ల నరసింహారెడ్డి అన్నారు. మక్తల్ క్లస్టర్‌కు సంబంధించి గన్ని బ్యాగులను అందజేయడంలో సంబంధిత శాఖ అధికారులు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నట్లు రైతులు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. సకాలంలో గన్ని సంచులను సమకూర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. దీంతో రైతులు తమ పంటనువిక్రయించే పరిస్థితి లేక కల్లాల్లోనే ధాన్యం ఆరబోసుకున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంగన్ని సంచులనుసమకూర్చాలని,లేనిచో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాడుతామని ఆయన అన్నారు.

### పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు..

# సంపన్నులతో సమానంగా సన్న బియ్యాన్ని అందజేస్తోంది

◆ గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్



లబ్ధిదారుడు సురేష్ నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ బి.యం సంతోష్

**కెటిదొడ్డి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మల్లాపురం గ్రామంలో లబ్ధిదారుడు సురేష్ నాయక్ కుటుంబ సభ్యులతో గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ స్వయంగా సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లబ్ధిదారుడి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత గల ప్రతి పేదవాడికి ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని అందించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. తద్వారా రేషన్ కార్డుదారులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా సన్న బియ్యం అందుతాయని అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సన్నబియ్యం పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందించాలన్నదే ప్రభుత్వ ఆశయమని పేర్కొన్నారు. పేద ప్రజలు ఆకలితో బాధపడకుండా పోషకాహారాన్ని పొందాలన్నదే ఈ పథక ప్రధాన ఉద్దేశమని అన్నారు.పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. సన్నబియ్యం లబ్ధిదారులు మాట్లాడుతూ తమ ఇంటికి కలెక్టర్, అధికారులు భోజనానికి రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. సన్న బియ్యం పథకం ద్వారా రుచికరమైన భోజనం చేస్తున్నామని అధిక డబ్బులు వెచ్చించి బియ్యాన్ని బయట కొనుగోలు చేయకుండా ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని లబ్ధిదారుడు తెలిపారు. అనంతరం కలెక్టర్, శాసన సభ్యులు గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, గద్వాల్ మార్కెట్ యార్డు చైర్మన్ నల్లహనుమంతు, తహశీల్దార్ హరికృష్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్



ఇందిరమ్మ ఇండ్ల పనులను, క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**కెటిదొడ్డి, ఏప్రిల్15 ప్రభాతవార్త :** కెటిదొడ్డి మండలం పరిధిలోని ఉమిత్యాల గ్రామంలో, ధరూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల పనులను, నమూనా ఇండ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఇండ్ల నిర్మాణం పనులు ఎలా జరుగుతున్నాయని లబ్ధిదారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల జాబితా పరిశీలించి, వారు వాస్తవంగా అర్హులేనా అనే విషయాన్ని ఖచ్చితంగా నిర్ధారించాలని ఎంపీడీఓ ను సూచించారు. అర్హతల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ యాప్ లో నమోదు చేస్తూ లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌సూచించారు. ధరూర్ మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు నమూనా గృహాల నిర్మాణపు పనుల పురోగతిని గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల కోసం ఉపయోగిస్తున్న సామగ్రి పనుల నాణ్యత, నిర్మాణ విధానాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ మోడల్ గృహం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, ఎంపీడీఓ కృష్ణ మోహన్, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై తగు జాగ్రత్తలు పాటించాలి



ఆత్మకూరు బస్టాండులో ప్రజలకు వివరిస్తున్న సిబ్బంది

**ఆత్మకూరు, ఏప్రిల్15 ప్రభాతవార్త:** అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో అగ్ని ప్రమాదాల నివారణ కోసం తగు జాగ్రత్తలు పాటించాలని ఆత్మకూరు అగ్నిమాపక శాఖ అధికారి నర్సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి అగ్ని ప్రమాద నివారణ వారోత్సవాలలో భాగంగా మంగళవారం మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని పబ్లిక్ స్థలాలలో అగ్ని ప్రమాదాల నివారణ పై ఆ శాఖ అధికారులు ప్రజలకు సూచనలు చేశారు. ప్రధానంగా ఆత్మకూరులోని బస్టాండు సమీపంలో ప్రజలను సమీకరించి అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించడమే కాకుండా ముఖ్యంగా వంటగదుల్లో జరుగుతున్న అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలని అంశంపై మహిళలకు తగు సూచనలు చేశారు. వారం రోజుల పాటు కొనసాగనున్న అగ్ని ప్రమాద నివారణ వారోత్సవాలను ఆత్మకూరు అగ్నిమాపక శాఖఆధ్వర్యంలో ప్రతిరోజు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఇందుకు సంబంధించి ప్రజలు తమకు సహాయ సహకారాలు అందించి అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఎప్పటికప్పుడు తమకు సమాచారాలు అందించడమే కాకుండా తాము చేపడుతున్న చర్యలకు సంపూర్ణ సహకారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు నరసింహా రెడ్డి, భీమేశ్వర్ రెడ్డి, నాగార్జున, వెంకటేష్, తదితరులతో పాటుగా పలువురు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో గిరిజన సంక్షేమానికి పెద్దపీట



సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న రామచందర్‌నాయక్

**బిజినేపల్లి, ఏప్రిల్15 ప్రభాతవార్త:** గిరిజనుల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని గిరిజన సంఘం జిల్లా నాయకులు రాంచందర్ నాయక్ అన్నారు. గంగారం పరిధిలోని కీమ్యాతాండా గ్రామపంచాయతీలో రూ.5లక్షలతో వేస్తున్న సిసి రోడ్లకు మంగళవారం భూమి పూజ చేశారు. రామచందర్ నాయక్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల రోడ్ల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేద ప్రజల పక్షపాతి అని, ఆయన నాయ కత్వంలో పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఇటీవల కాలంలో పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పథకాన్ని అందిం చడం జరిగిందని ఆయన అన్నారు. మారుమూల గ్రామంలో రోడ్లు, విద్య, వైద్యం, తదితర మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు.ఈ కార్యక్రమంలో సోమ్లా, వెంకట్, రవీందర్ సంతోష్, శ్రీను, దశరథం తదితరులున్నారు.

## రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ



ఆత్మకూర్ ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీడీఓ

**ఆత్మకూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోనిమండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపాద మండల ప్రత్యేక అధికారి శ్రీరామ్ రెడ్డి ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 1150 మంది రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తులు చేశారని ఇందుకుగాను తమకు ఇప్పటివరకు 600 దరఖాస్తులు అందాయని మిగతా లబ్ధిదారులు పట్టణంలోని ఆయా మీసేవ కేంద్రాలలో దరఖాస్తులు చేశారని వాటిని కూడా స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లుగా వారు తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి లబ్ధిదారులను త్వరలోనే ఎంపిక చేసియూనిట్లను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు.

## దేశాభివృద్ధిలో ఆర్థిక శాస్త్రానిది ముఖ్యభూమిక

పియు పిజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.మధుసూదన్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** దేశాభివృద్ధిలో ఆర్థిక శాస్త్రం ముఖ్య భూమిక వహిస్తుందని పాలమూరు విశ్వ విద్యాలయ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పాలమూరు యూనివర్సిటీ పీజీ కాలేజీలో సెమినార్ హాల్ లో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డా. అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకొని జాతీయ అర్థశాస దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ డా. మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎగుమతులను ప్రోత్సహించాలని, దిగుమతులకు ప్రత్యామ్నయాలు చూసుకోవాలని, స్వదేశీ వస్తువులను కొనడం ద్వారా దేశఆర్థిక వ్యవస్థ బాగుపడుతుందని అన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డా. రాఘవేంద్రరావు, అధ్యాపకులు డా. జిమ్మీ కార్టన్, డా. శివలింగం, రాజ్‌నాయక్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

## రాజ్యాంగాన్ని పరిరక్షించి సత్యం, అహింస మార్గంలో దేశాన్ని నిర్మిద్దాం



పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

**మూసాపేట, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** మూసాపేట మండలం చక్రాపూర్ గ్రామంలో మంగళవారం జైబాపు జై భీమ్ జై సంవిధాన్ పాదయాత్రలో భాగంగా ఏఐసీసీ, టిపిపిసీ పిలుపుమేరకు నియోజకవర్గం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆదేశానుసారం మూసాపేట్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టిచంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండలంలోని చక్రాపూర్, స్ఫూర్తి తండాలో పాదయాత్రలో మండల్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొని పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రామ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గంటేల లక్ష్మినారాయణ మాట్లాడుతూ గ్రామంలో విధులలో పాదయాత్ర నిర్వహించి ప్రతి ఒక్క పౌరుడు భారత రాజ్యాంగానికి లోబడి ఉండాలి. సత్యం, అహింస భావాలను పాటిస్తూ మహాత్మా గాంధీ, అంబేద్కర్ ఆలోచన విధానాలకు కట్టుబడి ఉండాలనిఅన్నారు.అనంతరం అధ్యక్షులు శెట్టి చంద్రశేఖర్ సమ సమాజ నిర్మాణ కోసం పాటుపడాలని గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భాగ్య కృష్ణయ్య,బాల నరసింహులు, సిజిగోవర్ధన్, నిజాలాపూర్ రాంచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్, జానంపేట మాజీ సర్పంచ్ చెన్నమ్మ వెంకటయ్య, తిమ్మాపురం సురేష్, లక్ష్మారెడ్డి, కుర్వా శ్రీశైలం,గోరకొండ ఆంజనేయులు, జి.బ్రహ్మయ్య, చక్రాపూర్ మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, స్ఫూర్తితండా గోపాల్ నాయక్, రవినాయక్, ఉప్పరి మల్లయ్య, ఇస్రంపల్లి తిరుపతయ్య, చక్రాపూర్ గ్రామ మహిళలు మరియు స్ఫూర్తి తాండ గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటా బిజేపి నాయకుల ప్రచారం

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో చేపట్టిన బస్తీచలో కార్యక్రమాన్ని మంగళవారం దామరగిద్ద మండలంలో ఇంటింటా తిరిగి బిజెపి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు గోపాలరావు, జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షులు నబీ, స్టేట్ బీజేవైఎం కౌన్సిల్ మెంబర్ చంద్రశేఖర్ రెడ్డి, మండల నాయకులు, మంగలి నారాయణ, బిజెపి ప్రధాన కార్యదర్శి అంజయ్య గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు ఆశప్పయాదవ్, బీజేవైఎం మండల అధ్యక్షులు నారాయణతో బాటు తదితరులు ఉన్నారు.

## ఆత్మకూరులో అంబలి కేంద్రం ప్రారంభం

**ఆత్మకూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో మంగళవారం శ్రీ రామదూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. శ్రీ రామదూత చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఆంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం పేదల దాహార్తిని తీర్చేందుకు వేసవి కాలంలో ప్రతి సంవత్సరం మాదిరిగా అమలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లుగా వారు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్న నేపథ్యంలో శ్రీరామదూతా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఆత్మకూరులో అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లుగా వారు తెలిపారు. పట్టణంలోని కేబీఎస్ బ్యాంకు సమీపంలో అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు.

### ఘనంగా తెలంగాణ మాజీ స్పోర్ట్స్ అథారిటీ (స్పోట్స్) చైర్మన్ ఆంజనేయ గౌడ్ జన్మదినోత్సవం

**మల్దకల్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** మల్దకల్ మండల ప్రభుత్వ ఆసుపత్రిలో మల్దకల్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మధుసూదన్‌గౌడ్, వీరేష్ గౌడ్, ఆధ్వర్యంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ తెలంగాణ తొలి బీసీ కమిషన్ సభ్యులు డాక్టర్ ఆంజనేయ గౌడ్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలోరోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రామకృష్ణ ముదిరాజ్, తిరుమల్, పుణ్యమూర్తి, మాల రాజు, రామకృష్ణ వీరేష్, సత్యం నాయుడు, అనిల్, తిమ్మప్ప గౌడ్, మోహన్ గౌడ్ రామకృష్ణ, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** నారాయణపేట మండలం, కోటకొండ, అప్పిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పండించిన వరి ధాన్యాన్ని విక్రయించి గిట్టుబాటు ధరను పొందాలన్నారు. ప్రైవేటు షాపులను ఆశ్రయించి నష్టపోరాదన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అప్పిరెడ్డిపల్లి ప్రాథమికొన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. పథకాన్ని మెనూ ప్రకారం అంద చేస్తున్నారా లేదా యని అలాగే ఉపాధ్యాయుల పని తీరును విద్యార్థులచే అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, డైరెక్టర్ శరణప్ప, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అధికారులు ఉన్నారు.

**మక్తల్ టౌన్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** జక్లేర్ గ్రామంలో రైతుల నుండి వరిధాన్యం కొనుగోలును ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రెతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మక్తల్ మార్కెట్ చైర్మన్ రాధా లక్ష్మారెడ్డి తెలియ చేశారు. ప్రభుత్వం క్వింటాలుకురూ.2300 చెల్లిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చుసుకోవాల్సిందిగా ఐకేపీ, మహిళా సమైక్య సభ్యులకు సూచించారు ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు రంజిత్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులు, అగ్రికల్చర్ ఎఓ మిథున్ చక్రవర్తి, జేక్లేర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## చోరీకి గురైన సెల్ ఫోను బాధితుడికి అందజేసిన పోలీసులు

**ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన పోలిశెట్టి శ్రీనివాసులు ఐదు నెలల క్రితం మండల కేంద్రంలోని సంతలో తన సెల్ఫోన్ ఒప్పో ఎ35 పోగొట్టుకున్నాడు. అప్పుడే సిఈఐఆర్ పోర్టల్ యాప్ ద్వారా అప్లికేషన్ చేసుకున్నాడు అట్టి మొబైల్లో ఘణపురం పోలీసులు గుర్తించి మంగళవారం బాధితుడికి ఎస్సై సురేష్ గౌడ్ క్రైమ్ కానిస్టేబుల్ లింగము అందజేశారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరికైనా మొబైల్ ఫోన్ పోయినప్పుడు సిఈఐఆర్ యాప్ లేదా పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే మేము వాటిని వెతికి ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ మొబైల్‌ను ట్రేడ్ చేసిన క్రైమ్ కానిస్టేబుల్ పి.లింగంనుఎస్సై సురేష్ ప్రత్యేకంగా అభినందించారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**గద్వాల, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** జిల్లా కేంద్ర ఆసుపత్రిలో 130 మీటర్ల పొడవున చిన్న పిల్లల వార్డు, మెడికల్ హబ్, సిటీ స్కానింగ్ సెంటర్ లను కలుపుతూ ఆసుపత్రి ప్రధాన రోడ్డు వరకు రూ 6 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణపనులకు ఆసుపత్రి సూపర్‌డెంట్‌డాక్టర్ ఇందిరా మంగళవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభిచారు. సిసి రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత గా ఉండాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్ కు ఆమే సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డి ఈ శ్రీనివాస్, ఎఈ రహీం, మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్, డాక్టర్స్, కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రైతులు సద్వినియోగం చేసుకోవాలి : సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి



కొత్తమొల్గరలో వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి

**భూత్పూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** భూత్పూర్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) ఆధ్వర్యంలో భూత్పూర్ మండలంలోని కొత్తమొల్గర, పాతమొల్గర, వెల్కిచర్ల గ్రామాల్లో విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ కదిరే మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి గిట్టుబాటు ధరను కల్పిస్తోందని అన్నారు. రైతులు మధ్యదళారీలను నమ్మి మోసపోకుండా నేరుగా ప్రభుత్వమేర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో తాము ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్మాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) చొరవతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలనేర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సువర్ణావకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ రత్నయ్య, ఏఈఓలు శ్రీనివాసులు, మౌనికలతో పాటు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడురేకులపాటి భూపతిరెడ్డి, మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు హరియా నాయక్. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మందడి నర్సింహ్మారెడ్డిలతో పాటు ఇతర నాయకులు దెంది లక్ష్మికాంత్‌రెడ్డి, రాంరెడ్డి, తమన్నగౌడ్, ప్రతాప్‌రెడ్డి, వెంకటేష్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేత

- ఫైనల్ మ్యాచ్ విన్నర్ అంబేద్కర్ టీం
- రన్నర్ ఛత్రపతి శివాజీ టీం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**ఊట్కూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** ఊట్కూరు మండల పరిధిలోని అమీన్‌పూర్ గ్రామంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ గత వారం రోజుల నుండి జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌లు మంగళవారంతో ముగిశాయి. మొదటి బహుమతి కీ॥శే॥ యన్. నారాయణ రెడ్డి మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు జ్ఞాపకార్థం రూ. 22,222/ వారి కుమారులువి. శివారెడ్డి, వి. సుధాకర్‌రెడ్డి మాజీ రైతుబంధు సమితి అధ్యక్షులు, వి. రాంరెడ్డి వైస్ చైర్మన్ పిఏసిఎస్ ఉట్కూరు ఇవ్వటం జరిగింది. రెండవ బహుమతి రూ. 11,111/ కీ॥శే॥ హన్మిరెడ్డి కుమారు రవీందర్ రెడ్డి, ఆశిరెడ్డి ఇవ్వటం జరిగింది. ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించిన కొండాపురం రాజును, ఆంజనేయులు, బుక్క మైబును, మాకలి మల్లేష్ ఇతర సభ్యులను గ్రామస్థులు అభినందించారు. ఇలాంటి క్రీడలు మున్ముందు ఇంకా ఆడాలి అని కొనియాడారు. గెలుపు ఓటములు సమానంగా తీసుకొని ముందుకు వెళ్ళాలని చెప్పారు. ఈ కార్యక్రమంలోయన్. సుధాకర్‌రెడ్డి, మాజీ రైతుబంధు సమితి అధ్యక్షులుశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రవీందర్‌రెడ్డి, ఎండిసలీం, చాపాలి భీమసేన్, టోర్నమెంట్ నిర్వాహకులుకొండాపురం రాజు, ఆంజనేయులు, బుక్కమైబు, మాకలి మల్లేష్, చంద్రశేఖర్, మాజీ ఉపసర్పంచ్ గ్రామస్థులు పాల్గొన్నారు .

## కళ్యాణం.. కమనీయం

### కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు



**చిన్న చింతకుంట, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిన్న వడ్డేమాన్ గ్రామ సమీపంలో గల స్వయంభూగా వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీశివపార్వతుల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీ శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఆలయ కమిటీ సభ్యులు మంగళ వాయిద్యాల నడుమ కళ్యాణ మండపానికి తీసుకొచ్చారు. అక్కడ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. శివపార్వతుల కళ్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి నూతన దంపతులు భక్తులు అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు. శివపార్వతుల కల్యాణంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ సీత దయాకర్ రెడ్డి, మాజీ జెడ్పిచైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సతీమణి కవిత మధుసూదన్ రెడ్డిలు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అంతకుముందు శ్రీరామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు శ్రీశివపార్వతుల కళ్యాణంలో పాల్గొన్న ప్రముఖులకు దేవస్థాన కమిటీ సభ్యులుశాలువాతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. రాత్రికి శివ పార్వతులఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులకు అన్నదానంనిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారునికి హెల్మెట్ పంపిణీ



ద్విచక్ర వాహనదారునికి హెల్మెట్ అందిస్తున్న బిజెపి నాయకులు

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** డా. బాబా సాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి ఘనంగా నిర్వహించిన ప్రేమ్ టైలర్స్ 134వ డా. బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రేమ్ టైలర్ యజమాని నానమోని మన్యం హెల్మెట్ పంపిణీ చేశారు. డా. బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న బిజెపి అధ్యక్షుడు నారాయణ. మాజీ జెడ్పిటిసి చైర్మన్ రాకాసి లోక్‌నాథ్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లోకనాథ్ రెడ్డి, జిల్లా బిజెపి అధ్యక్షులు నారాయణ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి బైక్ నడపాలని ఆయన కోరారు. ప్రేమ్ టైలర్స్ నానమోని మన్నెం చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తిం చాలని ఆయన కోరారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మున్ముందు ఎన్నో చేయాలని ఆయన మన్యంను కోరారు. ప్రేమ్ టైలర్ షాప్‌లో బట్టలు కుట్టించిన కస్టమర్ జి శ్రీనివాసులును శాలువా తో సన్మానం చేసి హెల్మెట్ అందజేశారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, రోడ్డుపై వెళ్లినప్పుడుతరచుగా ప్రమాదాలుఅవుతున్నాయని అందుకుహెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

## ఘనంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడి జన్మదినోత్సవం

**వెల్దండ, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ జన్మదిన వేడుకలను వెల్దండ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ, వాసవీక్లబ్, రిక్రియేషన్ క్లబ్, జర్నలిస్టుల సంఘం, ముదిరాజ్ సంఘం, యువజన సంఘాల ఆధ్వర్యంలో వేర్వురుగా శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం బ్రహ్మ ంగారి దేవాలయంలో బచ్చు రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బచ్చు రామకృష్ణ పేరిట పూజా, అర్చన కార్యక్రమాలు నిర్వహించి దీవెనలను అందించారు. వాసవీ క్లబ్, మండల ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురునాయకులు గజమాలతోసన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి... ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో మెలుగాలని కోరుతూ భవిష్యత్తులో మరెన్నో పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో మండల నాయకులు పాల్గొన్నారు.



బచ్చు రామకృష్ణను సన్మానిస్తున్న సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, పలువురు నాయకులు

## హిందువులు సనాతన ధర్మం ఐక్యత పాటించాలి

- జగద్గురు శ్రీశ్రీ కాంతేంద్ర గురుస్వాములు
- శ్రీదక్షిణ కాశికాంబ సమేత కమటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



శ్రీదక్షిణ కాశికాంబ సమేత కమటేశ్వర స్వాముల ఊరేగింపు



సనాతన ధర్మం విశిష్టతలను భక్తులకు వివరిస్తున్న జగద్గురు శ్రీశ్రీ కాంతేంద్ర గురుస్వాములు

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** హిందువులు సనాతన ధర్మంతోపాటు ఐక్యమత్యం పాటించాలని, హిందు ధర్మ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలని జగద్గురు శ్రీశ్రీ కాంతేంద్ర గురు స్వామి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని పాతబజార్ శ్రీ దక్షిణ కాశికాంబ సమేత కమటేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ట వేడుకల్లో భాగంగా మంగళవారం వేద పండితుల మంత్రాల మధ్య పూజలు వైభవంగా జరిగాయి. రోడ్ల విస్తరణలో కాళిమాత ఆలయాన్ని తొలగించడంతో ప్రస్తుతం పునః ప్రతిష్ట మహోత్సవ వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా చేపడుతున్నారు. ఈ క్రమంలో ఒక్కొక్క క్రతువు యొక్క ప్రాధాన్యతను జగద్గురు శ్రీశ్రీ కాంతేంద్ర గురుస్వామి భక్తులకు వివరిస్తూ సనాతన ధర్మం యొక్క విశిష్టతలను తెలిపారు. హిందుధర్మ పరిరక్షణపై ఆధ్యాత్మిక ప్రవచనలు చేశారు. సనాతన ధర్మాన్ని పాటించాలని. ధర్మం యొక్క విశిష్టత గురించి సమాజానికి, నేటి తరాలకు తెలియజేయలన్నారు. పుట్టినరోజు వేడుకల్లో దీపాలు ఆర్పి, కేకులు కటింగ్ వంటివి చేయకూడదని, వృధా ఖర్చు చేయకుండా సాటి వారికి సాయం చేసినప్పుడే మన జన్మ సార్థకం అవుతుందన్నారు. మొదట ఆలయ ప్రాంగణం వద్ద ఉదయం భక్తులు హోమాలు చేశారు. సుప్రభాత సేవ, సహస్ర నామ పూజలు, విగ్రహ పంచామృత స్నానం, జలదివాసం, క్షిరాదివాసం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద స్వీకరణ, సాయంత్రం శ్రీ దక్షిణ కాశికాంబ సమేత కమటేశ్వర స్వాముల ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. కాళీకాంబ అమ్మవారి నామ స్మరణలతో పూజ కార్యక్రమానికి ప్రవాహంలా తరలి వచ్చిన భక్తులతో పాత బజార్ కాలనీ అంత కాషాయవర్ణంగా మారింది.

## ముస్లింల హక్కులను కాలరాయడమే బిజెపి లక్ష్యం

– సిపిఐ రాష్ట్ర సమితి కార్యదర్శి ఎం.బాల్‌నరసింహ, ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎండి.ఫయాజ్




సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర సమితి కార్యదర్శి ఎం.బాల్‌నరసింహ, ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎండి.ఫయాజ్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** వక్ఫ్ సవరణ బిల్లు చర్చసమయంలో పార్లమెంట్ సాక్షిగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం, బిజెపి దాని అనుబంధ పార్టీలు అబద్ధాలు చెప్పాయని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే విధంగా ఎన్డీఏ ప్రభుత్వం వ్యవహరిస్తుందని సిపిఐ రాష్ట్ర సమితి కార్యదర్శి, నాగర్ కర్నూల్ జిల్లా సమితి కార్యదర్శి ఎం. బాల్ నరసింహ అన్నారు. ముస్లింలకు సంబంధించి దాతలు దానం చేసిన భూములపై కన్నేసిన మోడీ సర్కార్ కుటిల నీతితో ముస్లింలలోని పేదలకు మేలు చేస్తున్నామని గొప్పలు చెబుతూ బిజెపికి అండగా ఉంటున్న బడా బాబుల కు వక్ఫ్ ఆస్తులు కట్టబెట్టడమే లక్ష్యంగా ఈ చట్ట సవరణ చేశారని ఆయన పేర్కొన్నారు. సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో వక్ఫ్ చట్ట సవరణను నిరసిస్తూ అంబేద్కర్ కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర సమితి కార్యదర్శి ఎం. బాల్ నరసింహ మాట్లాడుతూ కేంద్రంలోని పార్లమెంట్ ఉభయ సభల చర్చలో భాగంగా బిజెపి దాని మిత్రపక్షాల మంత్రులు ఎంపీలు మాట్లాడిన తీరు సభ్య సమాజానికి తల వంపుగా భావిస్తున్నామన్నారు. దేశంలో దేవాదాయ భూములను ఆస్తులను పరిరక్షించడానికి ఉన్న విధంగా ముస్లింలకు సంబంధించిన వక్ఫ్ భూములను పరిరక్షించడానికి ఒక బోర్డు అనాదిగా చట్టబద్ధంగా ఉంది అన్నారు. ఇది కేవలం ముస్లిం సమాజాన్ని అనుగదొక్కడానికే నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న కుట్రగా భావిస్తున్నామని ఆయన ఆరోపించారు. సిపిఐ అనుబంధ సంస్థ అయిన ఇన్సాఫ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకురావడంలో దురుద్దేశం దాగి ఉందన్నారు. వక్ఫ్ ఆస్తులపై కన్నేసిన నరేంద్ర మోడీ తన కనుసనల్లో ఉన్న మీడియా సోషల్ మీడియాను ఉపయోగించుకొని తప్పుడు ప్రచారం చేయించి ఈ బిల్లుకు రూపకల్పన చేశారన్నారు. ఒక సవరణ చట్టాన్ని ఒప్పుకునేదే లేదని దానిని రద్దు చేసే వరకు పోరాటం సాగిస్తామని వారు ప్రతిజ్ఞ బునారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులుగౌడ్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బండి లక్ష్మిపతి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కృష్ణాజి, రవిందర్, బొల్లెద్దుల శ్రీనివాసులు ఖుత్బుద్దీన్, బాల మురళి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బిజ్జ శ్రీనివాసలు, ఇన్సాఫ్ జిల్లా నాయకులుఎండీ యూసుఫ్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశమల్ల శివకృష్ణ, ముస్లిం మైనారిటీ సంఘాల నాయకులు షేక్ ఫరీద్ అహ్మద్, ఖాజు బాబా, ముస్తాఖ్ అహ్మద్, మహమ్మద్ అలీ, అనీస్, సయ్యద్ అహ్మద్, మహమూద్ అలీ, మహమ్మద్ ఖాజా, మహమ్మద్ సుల్తాన్, మహమ్మద్ ఖలీల్, మహమ్మద్ జాఫర్, మహమ్మద్ జహంగీర్ లతోపాటు ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాదాసి కురువ, మాదారి కురువలకు దళిత రత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న మాజీ జెడ్పిటిసి సభ్యుడు సిహెచ్ వెంకటయ్య

**కోయిలకొండ, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** మాదాసి కురువ, మాదారి కురువ కులానికి దళిత రత్న అవార్డు వచ్చిందని మండలంలోని కేశవాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ బత్తుల మొగులయ్య తెలిపారు. మంగళవారం ఆయన మండలంలో విలేకరులతో మాట్లాడుతూ డా. అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర రాజనరసింహ చేతుల మీదుగా ఎస్సీ 57 కులాలకు ఒక్కొక్క కులానికి ఒక్కొక్క దళిత రత్న అవార్డు ఇవ్వడంజరిగిందని ఆయన తెలిపారు. తెలంగాణ మాదాసి కురువ, మాదారి కురువ సంక్షేమ సంఘము నుంచి నారాయణపేట జిల్లా నర్వ మండలంయాంకి గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి సభ్యుడు సిహెచ్ వెంకటయ్యకు దళిత రత్న అవార్డు రావడంతో రాష్ట్ర మంత్రివర్యులు దామోదర రాజనర్సింహకు, తెలంగాణ ప్రభుత్వంకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదాసి కురువ, మాదారి కురువ సంఘం నేతలు పాల్గొన్నారు.

## రిమాండ్ చేసి కోర్టులో హాజరు

**ఇటిక్యాల, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సాతర్ల గ్రామానికి చెందిన షాలును మంగళవారం అల్లంపూర్ సిఐ రవి బాబు విచారణ అనంతరం అరెస్టు చేసి అతనిని అల్లంపూర్ కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఎస్సై వివరాల మేరకు గత నెల మార్చి 30వ తేదీ మధ్యాహ్న సమ యంలో తన భార్య షంషీన్ అలియాస్ నసియా భానుతో గొడవ పడి రోకలి బండతో తలపై కొట్టగా బలమైన రక్త గాయాలు తగిలాయి. దీంతో ఆమె కోమాలోకి వెళ్ళగా కర్నూలు ప్రభుత్వా సుపత్రికి చికిత్స కోసం తరలించి చికిత్స పొందుతుండగా తల్లి మాసుంబి ఇటిక్యాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై వెంకటేష్ కేసునమోదు చేశారు. కాగా చికిత్స పొందుతూ కోలుకోలేక నసియాభాను (32) ఈనెల ఏప్రిల్ నెల 4వ తేదీ మృతి చెందగా ఆ కేసును మర్డర్ కేసుగా నమోదు చేసి అల్లంపూర్ సిఐ రవిబాబు కేసును విచారించగా మంగళవారం షాలును అరెస్ట్ చేసి అల్లంపూర్ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

## కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే గిట్టుబాటు ధర

పేట మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే గిట్టుబాటు ధర పొందడానికి ఆస్కారం ఉంటుందని పేట మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం శివ రెడ్డి అన్నారు. మంగళవారం దామరగిద్ద మండలం ఆశన్ పల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించినట్లయితే గిట్టుబాటు ధర పొందడానికి ఆస్కారం ఉంటుందన్నారు. రైతంగానికి పెద్దపీట వేసిన ఘనత రేవంత్ సర్కార్‌కి దక్కిందన్నారు. రైతు సంక్షేమాన్ని కోరుకునే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్‌చైర్మన్ పుట్టి ఈదప్ప, మండల అధ్యక్షులు బాల్ రెడ్డి, సాయిరెడ్డి, సురేందర్ రెడ్డి, భగవంతు, నవీన్ రెడ్డి, సదానందం, గోవింద్ రెడ్డి, శ్యామ్యూల్ రైతులు పాల్గొన్నారు.

## బీసీ భవనం కేటాయించండి

ఎమ్మెల్యే యెన్నంకు బీసీ కుల సంఘాల విజ్ఞప్తి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

**మహబూబ్‌నగర్ ఏప్రిల్15 ప్రభాతవార్త:** పాలమూరు జిల్లాలో 65 శాతం బీసీలు ఉన్నందున బీసీ సంఘాలు వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు, సమావేశాలు పెట్టుకునేందుకు, ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించుకునేందుకు తమ బీసీ కుల సంఘాలకు ప్రత్యేక బీసీ భవన్ కేటాయించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డికి బిసి కుల సంఘాలు, ప్రజా సంఘాలు వినతి పత్రం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ కుల సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు ఎక్కడ ప్రత్యేక బీసీ భవన్ లేదని, కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో బీసీల పట్ల చొరవచూపి బీసీ భవనం కేటాయించినట్లయితే రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ జిల్లా పేరు చిరస్థాయిగా ఉండటమే కాకుండా బీసీల అభిమానం చూరగొనేందుకు అవకాశం ఉందన్నారు. బీసీలు వివిధ కార్యక్రమాలు సొంత డబ్బులతో పెట్టి నిర్వహిస్తున్నారు. కాబట్టి ఒక బీసీ భవన్ ఉంటే ఇటువంటి ఖర్చులు తగ్గించుకొని సంఘాల అభివృద్ధికి తాము ఖర్చు పెట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలో జిల్లా కేంద్రంలో బీసీ భవన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని సంతోషదాయకామని బీసీ సంఘాలనాయకులు అన్నారు. బిసి సంఘాల ప్రతినిధులు మోడల శ్రీనివాస్‌సాగర్, సారంగి లక్ష్మికాంత్, బుగ్గన్న, రామచంద్రయ్య, చిట్యాల రాములు, వడ్డెర చంద్రయ్య, పురుషోత్తం, అశ్విని సత్యం, డి.కృష్ణ, నాగప్ప, చంద్రశేఖర్, మల్లేష్, నగేష్, పాలమూరు కృష్ణయ్యసత్యం, ఆశన్న ముదిరాజ్, మ్యాదరిరాములు, తాయప్ప ముదిరాజ్, పాలకొండ గోవర్ధన్, ఆశన్న, సత్యనారాయణ సాగర్, కన్నా, కొంకతి రాములు, సతీష్, డి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**భూత్పూర్, ఏప్రిల్15, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) నుంచి మంజూరైన రు.60వేల విలువ చేసే చెక్కును భూత్పూర్ మండలం కొత్తమొల్గర గ్రామానికి చెందిన అనసూయమ్మకు ఎమ్మెల్యే జీఎంఆర్ సూచన మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తమన్నగౌడ్, దెంది లక్ష్మికాంత్‌రెడ్డి, టీవీ రెడ్డి, రఘు, రఘుపతిరెడ్డి, రాంరెడ్డి, వెంకటేష్, మాసగౌడ్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



కొత్తమొల్గర అనసూయమ్మకు చెక్కును అందజేస్తున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

## బచ్చు రామకృష్ణకు జన్మదిన అభినందనల వెల్లువ

- బచ్చు రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు




బచ్చు రామకృష్ణను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** హైదరాబాద్ లోని నోవాటెల్ హోటల్‌లో నాగర్‌కర్నూల్ ఆర్యవైశ్య మహాసభ జిల్లాఅధ్యక్షులు, నాగర్‌కర్నూల్ జిల్లా వార్త దినపత్రిక స్టాఫర్ బచ్చు రామకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బచ్చు రామకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్‌లోని నోవేటా హోటల్‌లో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎమ్మెల్సీలు కూచకుళ్ల దామోదర్ రెడ్డి, బొగ్గరపు దయానంద్‌లు రామకృష్ణకు శాలువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. జన్మదిన వేడుకల్లోకల్వకుర్తి మాజీ సర్పంచ్‌బృంగి ఆనంద్‌కుమార్, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజీవ్‌కుమార్‌యాదవ్, నాయకులు చిన్న రాంరెడ్డి, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

## ఉప్పునుంతలలో క్రికెట్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**ఉప్పునుంతల, ఏప్రిల్15 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో డా. బి.ఆర్ అంబేద్కర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను మంగళవారం అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. క్రికెట్ పోటీలతో ఐక్యత చాటుకుందని, భవిష్యత్తులో యువత అన్ని రంగాల్లో ముందుకు రావడానికి ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. టాస్ వేసి టీమ్‌ని ఎంపిక చేశారు. అనంతరం క్రికెట్ పోటీలను తిలకించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతోపాటు టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు, అఖిల భారతయాదవ సంఘం అధ్యక్షుడు కొట్టే శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ బాలు నాయక్, తాడూరు కృష్ణయ్య, సర్వేశ్వర్, గుజ్జ సతీష్ రెడ్డి, అశోక్‌రెడ్డి, ఎల్లయ్య యాదవ్, చిన్న జంగయ్య, శంకర్, బాలస్వామి, బింగి పర్వతాలు, క్రీడ నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పోషక పదార్థాల ఆహారంతో ఆరోగ్యవంతమైన జీవితం

- ఐసిడిఎస్ సూపర్వైజర్ భాగ్యలక్ష్మి



పోషణ అభియాన్ వారోత్సవాలు జరుపుకుంటున్న దృశ్యం

**కోయిలకొండ, ఏప్రిల్15 ప్రభాతవార్త:** పోషక పదార్థాల ఆహారంతో ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి సూచించారు. మంగళవారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో పోషణ అభియాన్ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శరీరంలోశక్తి సామర్థం పెరగడానికి చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు తీసుకోవాలన్నారు. పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని టీచర్లు ప్రతినిత్యం బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు చెప్పి అవగాహన కల్పించాలన్నారు. వివిధ రకాల పోషక ఆహార పదార్థాలను ప్రదర్శించారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు గడ్డం హనుమంతు మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టి ఆడబిడ్డలను చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్లో పోషణ పక్షం



**మల్దకల్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం సద్దలోనిపల్లి గ్రామంలో అంగన్వాడి సెంటర్ల లో పోషణ పక్షంలో భాగంగా నేడు శిశువులకు, బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు, ఈ చిరుధాన్యాలు పిల్లలకు పెట్టడం చాలా మంచిది పోషక పదార్థాలు కూడా అని అన్నారు. జీరో నుండి త్రీ ఉన్న పిల్లలు తప్పనిసరి అక్షర అభ్యాసం చేయవలసి ఉంటుందని అన్నారు. ప్రతి శిశువుకి కూడా అన్నప్రాస లో జరిగే ఆహార పదార్థాలు కావచ్చు అలాగే చిరుధాన్యాలు కావచ్చు అన్నప్రాస ద్వారా ప్రతి పిల్లలకు కూడా ఇవన్నీ తప్పనిసరి ప్రతి ఒక తల్లులు పాటించాల్సిందే అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు సువర్ణమ్మ, వెంకటేశ్వ రమ్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నల్లన్న, బాలింతలు, గర్భిణీ స్త్రీలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ డిఎం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

**నారాయణపేట టౌన్, ఏప్రిల్15 ప్రభాతవార్త:** నేటి డైల్ యువర్ డిఎం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నారాయణపేట డిపో మేనేజర్ లావణ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ నారాయణపేట పట్టణ, కోస్గి పరిసర ప్రాంతాల ప్రజలకు నేడు బుధవారం ఉదయం 11.00 గంటల నుండి 12.00 గంటల వరకు డయల్ యువర్ డియం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు ఫోన్ నెంబర్‌కు 73 82 82 62 93కు ఫోన్ చేసి తగు సమస్యలు సలహాలు, సూచనలను తెలియజేయవచ్చునన్నారు.

## భూభారతి నూతన రెవెన్యూ

# చట్టంపై ప్రజలకు అవగాహన

**ఈ నెల 17 నుంచి రెవెన్యూ టీంలు ప్రజల నుండి**

**విజ్ఞప్తులను స్వీకరణ : జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పనకు, రెవిన్యూ గ్రామాల్లో 17వ తేదీ నుంచి రెవిన్యూ టీంలు సందర్శించి ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో తాసిల్దారులు ఆర్ఐలతో సమావేశం నిర్వహించి భూ భారతి చట్టాన్ని అమలు పైలెట్ ప్రాజెక్టుగా మొట్టమొదటిసారిగా జిల్లాలోని మద్దూరు మండలాన్ని ఎంపిక చేసిందని అన్నారు. ఈ మండలంలో భూనిర్వాసితులు వారి సమస్యలను తీర్చుటకు రెవెన్యూ సిబ్బందికి ప్రతి ఒక్కరు భూములకు సంబంధించిన దస్తావేజులు అన్ని డాక్యుమెంట్లు తమ వెంట ఉంచుకోవాలని తెలిపారు. 17వ తేదీ నుంచి రెవిన్యూ టీంలు ప్రజల నుండి స్వీకరించిన విజ్ఞప్తులపై గ్రామ సదస్సులను నిర్వహించి భూ భారతి చట్టం ప్రకారం అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 17న మద్దూరు మండలానికి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరై చట్టాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్ శాలం, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత గంగ్వార్, ఆర్‌డిఓ రాంచందర్, తహిల్దార్‌లు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## ఈదురుగాలుల పంట నష్టం పరిశీలన



నష్టపోయిన పంట వివరాలను సేకరిస్తున్న దృశ్యం

**వెల్దండ, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** మండలంలోని కొట్ర బొల్లంపల్లి గ్రామాలలో ఈదురు గాలులకు జరిగిన పంట నష్టాన్ని ఏఓ శోభారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జరిగిన పంట నష్టాన్ని ఉన్నతాధికారులకు అందజేస్తామని, మండలంలో ఎక్కడైనా పంట నష్టం జరిగితే రైతులు తమకు తెలియజేయాలని, ఈదురుగాలులకు కొట్ర గ్రామంలో 4 ఎకరాలలో వరి పంట బొల్లంపల్లి గ్రామంలో 12 మంది రైతులకు చెందిన మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ డాక్య నాయక తో పాటు రైతులు ఉన్నారు

## నేడు మండలంలో ఎమ్మెల్యే గారిచే భూమి పూజలు

**వెల్దండ, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిధులచే చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చే భూమి పూజలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ చంద్రుడు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉదయం 11 గంటలకు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జడ్.పి.హెచ్.ఎస్ బాలుర పాఠశాల, మోడల్ పాఠశాల సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయాలలో మంజూరైన పనులకు భూమి పూజ నిర్వహిస్తున్నట్లు, కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు అధికారులు గ్రామస్తులు పాల్గొనాలన్నారు.

## నిరుపేద కుటుంబానికి పుస్తెమెట్టలు అందజేత



పెళ్లికి పుస్తె,మెట్టెలు అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** నిరుపేద కుటుంబానికి చెందిన ధన్వాడ గ్రామం ముదిరాజ్ బిడ్డ పెళ్లికి మంగళవారం అర్చన జ్యువెలర్స్ యజమాని ముదిరాజ్ సంఘం నారాయణపేట జిల్లా అధ్యక్షులు కె.సరాఫ్ నాగరాజు పుస్తె, మెట్టెలు అందజేశారు. నిరుపేద కుటుంబానికి పుస్తె, మెట్టెలు అందజేయడంతో కుటుంబీకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన వెంట స్థానిక శాసనసభ్యురాలు డా. చిట్టెం పర్ణిక రెడ్డి వ్యక్తిగత సహాయకులు చిట్టెం మాధవరెడ్డి, నారాయణపేట జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఎం.కాంత్ కూమార్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్స్ ఎ.వినోద్ కుమార్, బి.మారుతి తదితరులు పాల్గొన్నారు.

## ఈదురుగాలితో కురిసిన అకాల వర్షానికి మహిళ మృతి



మృతి చెందిన మహిళ

**మూసాపేట,ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** మూసాపేట మండలం వేముల గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో గాలి తాకిడికి డబ్బా తిరగబడి మహిళ మృతి చెందింది. వివరాల్లోకెళ్తే అల్లామాయపల్లె అయ్యమ్మ (75) భర్త మల్లప్ప సంతానం ఇద్దరు కుమారులు రెండు రోజుల క్రితం రెండు ఎకరాల వరి చేను కోసి ఎండబెట్టడానికి రోడ్డు ప్రక్కల వడ్లని ఆరబెట్టారు. మంగళవారం సాయంత్రం అకాల వర్షం గాలులు వీస్తున్నాయి అని కాపలాగా ఉన్న అల్లమాయపల్లి అయ్యమ్మ తలదాచుకోవడానికి ప్రక్కనే ఉన్న డబ్బా దగ్గరికి వెళ్లిందని బలమైన గాలి తాకిడికి అక్కడే ఉన్న మృతురాలు అల్లమాయపల్లె అయ్యమ్మ మీదడబ్బా పడగా ఆమెకు డబ్బా రేకులు ముఖానికి కుచ్చుకోవడంతో గాయాలయి రక్తస్రావం కావడంతో ఊపిరాడక ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు అక్కడ ఉన్న స్థానికులు తెలిపారు.

## పెళ్లి వేడుకకు ఎంపికి ఆహ్వానం



ఎంపి డికె అరుణకు
ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని 19వ వార్డుకు చెందిన బిజెపి కార్యకర్త రాధా మల్లేష్ దంపతుల కూతురు వివాహానికి తప్పక హాజరై వధూవరులను ఆశీర్వదించాలని పాలమూరు ఎంపి డికే అరుణను కలిసి బిజెపి సామాన్య కార్యకర్త మల్లేష్ మంగళవారం పెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. అందుకు తప్పకుండా పెళ్లికి హాజరవుతానని ఎంపి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కోశాధికారి సిద్ది వెంకట్ రాములు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సత్య రఘుపాల్ పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్‌ను ముందు వరుసలో నిలుపుదాం!

**● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి**



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** మహిళా శక్తి ,బ్యాంక్ లింకేజీ, ఉపాధి హామీ కార్యక్రమాల్లో జిల్లాను రాష్ట్రంలో ముందు వరుసలో నిలుపాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఎస్‌సి.ఎస్‌టి.,బిసి.,మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు,ఎంపిడిఓలు, ఎంపిఓలు, డిపిఎం, ఎపిఎంలతో వెబెక్స్ నిర్వహించి మహిళా శక్తి, స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం,రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, త్రాగు నీటి సరఫరా, పారిశుద్ధ్యం,ఎల్‌అర్‌ఎస్ తదితర కార్యక్రమాలు సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల గ్రూపులలో ఇంకా చేరని మహిళలు ఉంటే సభ్యులుగా చేర్పించాలని అన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. మహిళా సంఘాల ద్వారా స్కూల్ యూనిఫాం కుట్టు పనులు, సోలార్ విద్యుత్ ప్లాంట్‌లు,మినీ గోదాం,పెట్రోల్ బంక్‌లు, బస్సులు నిర్వహణ అనేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ కింద గరిష్ట వేతన రేటు 307 పెంచినందున జాబ్ కార్డ్ కూలీలు గరిష్ట వేతనం పొందేలా కొలతలు వేసి పనులు నిర్వహించాలని అన్నారు. వేసవిలో గ్రామాల్లో త్రాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామాలలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని అన్నారు. రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తుల గడువు ముగిసినందు నదరఖాస్తులు ఆన్ లైన్ లో వచ్చినవి డౌన్ లోడ్‌చేసుకోవాలని అన్నారు.దరఖాస్తులను ఎస్.సి., ఎస్.టి. ,బి.సి., మైనార్టీ కార్పొరేషన్ వారీగా, సబ్సిడీ యూనిట్ వారీగా విభజించాలని అన్నారు.ఈ నెల 20లోగా పూర్తి చేయాలని అన్నారు. ఏప్రిల్ 15 నుండి మే 20 వరకు మండల కమిటీ పరిశీలన పూర్తి చేసి బ్యాంక్ ఆమోదంతో జిల్లా కమిటీకి పంపాలని అన్నారు. మే 21 నుండి మే 31 వరకు జిల్లా కమిటీ పరిశీలన చేసి కలెక్టర్,జిల్లా ఇన్చార్జి మంత్రి ఆమోదంతో జూన్ 2 నుంచి మంజూరు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని అన్నారు. ఏప్రిల్ 17లోగా సంబంధిత శాసన సభ్యులను సంప్రదించి మండల, గ్రామ వారీగా టార్గెట్ నిబంధనలు అనుసరించి పూర్తి చేయాలని అన్నారు.ఈ నెల 18 నుండి 21 వరకు ఇందిరమ్మ కమిటీలు అర్హుల జాబితాను పరిశీలన చేయాలని, తర్వాత జాబితాను పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఓ.,ఇతర అధికారులు మండల వారీగా జాబితా పరిశీలన చేసి అర్హుల జాబితా రూపొందించి మే 2న గ్రామం వారీగా ప్రసర్శించాలని అన్నారు. మే 3 నుండి 5 వరకు ఇన్చార్జి మంత్రి ఆమోదంతో మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జడ్‌పిసి ఈఓ వెంకటరెడ్డి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శంకరాచారి జిల్లా బి.సి. అభివృద్ధి అధికారి ఇందిరా, డిఆర్‌డిఓ నరసింహులు అదనపు డిఆర్‌డిఓ జోజప్ప, డిపిఓ పార్థసారథి పాల్గొన్నారు.

# ఘనంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడి జన్మదినోత్సవం





ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బచ్చు రామకృష్ణ జన్మదిన వేడుకలు

**కల్వకుర్తిటౌన్, ఏప్రిల్15, ప్రభాతవార్త:** 27 వసంతాలుగా వార్త దిన పత్రికలో పనిచేస్తూ అవినీతిని రూపుమాపేందుకు ఎన్నో కథనాలను అందిస్తూ ప్రజల్లో చైతన్యాన్ని కల్పించి మృదుస్వభావిగా, ఆపద వస్తే నేనున్నానని భరోసా కల్పిస్తూ మంచి మనస్సుతో ముందడుగు వేసి అందరి మన్ననలు పొందుతూ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభాతవార్త స్టాపర్ శ్రీ బచ్చు రామకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు సుదర్శన్‌రెడ్డి, బృంగి ఆనంద్‌కుమార్, వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డిల ఆధ్వర్యంలో బచ్చు రామకృష్ణ జన్మదిన వేడుకలను నిర్వహించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పాత్రికేయులు, స్నేహితులు, ఆర్యవైశ్య బంధువులు శాలువాలతో సన్మానించి కేక్‌ను కట్ చేయించి తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలుపడంతో పాటు చిరుకానుకలనుఅందించి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఎన్నో ఒడిదుడు కులను ఎదుర్కొని జీవితాన్ని సన్మార్గంలో నడిపించేందుకు జీవిత లక్ష్యాన్ని ఎంచుకొని నేడు ఎంతో మందికి ఆదర్శ ప్రాయులుగా నిలిచారని వారు కొనియాడారు. నేను అనుభవించిన ఇబ్బందులు, కష్టాలను నా తోటి వారు పడవద్దని ఆపద ఉందని ఎవ్వరు ఆశ్రయించిన వారికి సహాయం చేసే మంచి గుణంకలిగినవ్యక్తి అని వారు పేర్కొన్నారు. బచ్చు రామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యక్షంగా, పరోక్షంగా నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుతు న్నానన్నారు. నన్ను నమ్మిన వ్యక్తులకు ఏ ఒక్క రోజు కూడా అన్యాయం చేయకుండా అందరితో కలిసి వారి కష్టాల్లో పాలు పంచుకొనివారి బాగోగులు చూస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు షాన్‌వాజ్‌ఖాన్, రాములు, రమేష్, ఏజాస్, మక్బూల్, రేష్మాబేగం, చిన్న రాంరెడ్డి, పలువురు ఉన్నారు.

**ఆర్యవైశ్య మహాసభ, వాసవీక్లబ్, క్లాస్మేట్ క్లబ్‌ల ఆధ్వర్యంలో:** కల్వకుర్తి పట్టణంలోని వాసవీమాత ఆలయంలో ఆర్యవైశ్య బంధు మిత్రులతో కలిసి వాసవీమాతనుదర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బచ్చు రామకృష్ణ పేరిట అర్చన కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందించారు. ఆర్యవైశ్య మహాసభ, వాసవీక్లబ్,క్లాస్మేట్ క్లబ్ సభ్యులు బంధుమిత్రులు సన్మానించి మెమోంటోను బహుకరించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బచ్చు రామకృష్ణ మాట్లాడుతూ కన్యకాపరమేశ్వరి ఆలయంలో జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, కల్వకుర్తి ఆర్యవైశ్య, లయన్స్‌క్లబ్, అవోపా, వాసవీక్లబ్,క్లాస్మేట్ క్లబ్‌ల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించడం గర్వకారణమని, నాపై నమ్మకం ఉంచి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా కొనసాగిస్తున్నందుకు వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ఆర్యవైశ్య అభివృద్ధి కోసం కృషి చేస్తానని,నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకుఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. పెద్ద ఎత్తున జన్మదినసంబురాలు నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, జిల్లా కోశాధికారి శివ్వ జగదీశ్వర్, అదనపు ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, ప్రచార కార్యదర్శి రాజయ్య, ఉపాధ్యక్షులు ఉప్పు ఆంజనేయులు, వాస శేఖర్, కల్వ రమేష్, రాజేష్, శ్రీను

# వందరోజుల టిబీ సర్వే కార్యక్రమాలు విజయవంతం

**● వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పని తీరు అద్భుతం**

**● వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



సిబ్బందిని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** జిల్లాలో మిషన్ మధుమేహ, వందరోజుల టిబీ సర్వే కార్యక్రమాలు విజయవంతం చేయడంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అద్భుతంగా పనిచేశారని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రశంసించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మిషన్ మధుమేహ కార్యక్రమంలో భాగంగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, సిబ్బందికి అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మిషన్ మధుమేహ, వందరోజుల టిబి సర్వే కార్యక్రమాలు విజయవంతం చేయడంలో వైద్య ఆరోగ్యశాఖఅధికారులు, సిబ్బంది అద్భుతంగా పనిచేశారని కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్య శాఖకు అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించిన ఏఎన్ఎంలకి, స్టాఫ్ నర్స్‌లకి, ఆశా వర్కర్స్‌కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వారు చేసిన కృషి చాలా గర్వపడే విషయమని కొనియాడారు. జిల్లాలో 30 ఏళ్లు పైబడిన వారికి 3,09,643 మందికి మిషన్ మధుమేహాలో భాగంగా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో 19500 మందికి డయాబెటిస్ ఉన్నట్లు గుర్తించినట్లు, వారిలో 3,000 మంది కొత్తగా డయాబెటిస్‌బారిన పడిన వారు ఉన్నారని గుర్తించడం జరిగిందన్నారు. డయాబెటిస్ గుర్తించిన వారందరికీ మందులతో పాటు, జీవనశైలిలో మార్పులను సూచించడం జరిగిందని చెప్పారు. దాదాపు 60రోజులపాటు 883 మంది వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాలొన్నారని తెలిపారు. దీంతోపాటు 100 రోజుల టీబీ సర్వేను కూడా విజయవంతం చేశారని చెప్పారు. జిల్లావ్యాప్తంగా కొత్తగా 753 టీబీ కేసులను గుర్తించినట్లు తెలిపారు. వందరోజుల టీబీ సర్వే కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో జిల్లా ప్రథమ స్థానం సాధించిందని, అది సిబ్బంది కృషి వల్లనే సాధ్యమైందని చెప్పారు. మిషన్ మధుమేహాలో భాగంగా డయాబెటిస్‌బారిన పడినవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన జీవన విధానాలపై వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో విడుదల చేసిన పోస్టర్ను విస్తృతంగా అందరికీ అందజేయాలన్నారు. కేవలం ప్రజలకు మాత్రమే జీవనశైలిపై సూచనలు చేయకుండా, వైద్య శాఖ సిబ్బంది కూడా జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా గత ఆరు నెలల్లో వైద్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల్లో అత్యుత్తమంగా పనిచేసిన వారికి అవార్డులు ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యశాఖఆధ్వర్యంలో చేపట్టిన మిషన్ మధుమేహ కార్యక్రమంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు, డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ అబ్దుల్ వాసే,ఎన్సిడి ప్రోగ్రాం అధికారి రామచంద్రరావు, టీబీ సర్వే ప్రోగ్రామ్‌అధికారి సాయినాథ్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి చట్టంపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలి

**● వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

**వనపర్తి టౌన్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టంపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ తన ఛాంబర్ లో కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లతో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించడం పై సమీక్ష నిర్వహించారు. భూ భారతి చట్టం2025 పై రైతులకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఏప్రిల్17 నుండి మండలాల వారీగా రైతు వేదికల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి చట్టంపై అవగాహన, అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. ధరణి స్థానంలో వచ్చిన భూ భారతి చట్టం 2025 ప్రకారం ఒకేరోజు రిజిస్ట్రేషన్‌తో పాటు మ్యుటేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అయితే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసే ముందు సంబంధిత భూమి సర్వే చేసే మ్యాప్ తయారు చేయడం జరుగుతుంది. తహసిల్దార్ ద్వారా భూ రిజిస్ట్రేషన్ అయిన వెంటనే మ్యుటేషన్ చేస్తారని తద్వారా నెలల తరబడి మ్యుటేషన్ కొరకు తిరగటం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవడంఉండదన్నారు. అదేవిధంగా ప్రతి రిజిస్ట్రేషన్ భూమికి పట్టాదార్ పాస్ పుస్తకంలో హద్దులతో కూడిన చిత్రపటం ఉంటుందని, భూదాన్ యూనిక్ గుర్తింపు నెంబరు కేటాయించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ధరణిలో పెండింగ్ ఉన్న ఫిర్యాదులను నిర్ణీత గడువు లోపు పరిష్కరించేందుకుచట్టంలో వెసులుబాటు కల్పించారని తెలియజేశారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం ఉంటుంది. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, భూ సమస్యల పరిష్కారానికి రెండెంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుంది. రైతులకు ఉచిత న్యాయ సహాయం, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం భూ భారతి చట్టంలో కల్పించడం జరిగిందన్నారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, సెక్షన్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

# బైరాపుర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు భూమి పూజ

**వెల్దండ, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ద్వారానే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని బైరాపూర్ కాంగ్రెస్ నాయకులు తలారి నరసింహ అన్నారు. మంగళవారం బైరాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిధుల ద్వారా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సంధర్భంగా తలారి నరసింహ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో 10 లక్షల రూపాయలతో పనులు ప్రారంభించామని, ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్ల పెద్ద జంగయ్య, జర్పుల శ్రీను నాయక్, చెన్నయ్య, నల్ల ఎల్లమ్మ, అంజమ్మ, బాల్ నరసింహ, జోగు శేఖర్, జంగమ్మ, లక్ష్మమ్మ, గిరి, విష్ణు, సత్తయ్య, మహిపాల్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## కుమారుడి వివాహేతర బంధం... దారుణ హత్యకు గురైన తండ్రి

మొదటి పేజీ తరువాయి భాగం..

చేరుకొని వివరాలను తెలుసుకున్నారు. కాగా కొడుకు తప్పు చేస్తే తండ్రి దారుణంగా హత్య చేయడం ఎంత వరకు సభభని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పరమేశ్వర్‌పై జరిగిన దాడి గురించి అప్పట్లోనే ఫిర్యాదు చేసిన అచ్చంపేట ఎస్సై పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. హత్య చేసిన నిందితులను పట్టుకొచ్చి కఠినంగా శిక్షిస్తేనే మృతదేహాన్ని తీసుకెళ్తామని అప్పటివరకు రహదారి పక్కనే ఉంచుతామని తేల్చి చెప్పారు.హత్యతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్తపరిస్థితులు నెలకొనడంతో గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.మృతుని బంధువులు మాత్రం శవాన్నిహత్య చేసిన నిందితుల ఇంటి దగ్గరనే ఉంచుతామని తమకు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని అక్కడ నుంచి తీసుకెళ్లమని తేల్చి చెప్పారు. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## గర్భిణీలు పోషకాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న కౌన్సిలర్ జ్యోతి

**జడ్చర్ల, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** పోషణ పక్షం సందర్భంగా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేటలో అవగాహన సమావేశం నిర్వహించారు. సిడిపిఓ శోభారాణి గర్భిణీ బాలింతలు కిషోర బాలికలు ప్రతిరోజు పాలు గుడ్లు, పండ్లు, ఆకుకూరలు తీసుకోవడం వల్ల పోషకాహార లోపం నుంచి బయట పడవచ్చన్నారు.ముఖ్యంగా గర్భిణీలు ప్రతిరోజు ఇవన్నీ తీసుకోవడం పుట్టబోయే పిల్లలు నార్మల్గా జన్మిస్తారని తెలిపారు. కౌన్సిలర్ జ్యోతి కృష్ణా రెడ్డి మాట్లాడుతూ పిల్లలు పుట్టినప్పటి నుండి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఏడవ నెలనుండి అనుబంధ పోషకాహారం ఇవ్వాలని చెప్పారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుగుణ, అంగన్వాడీ టీచర్‌లు, హెల్పర్లు, తల్లులు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయం బీజేపీనే



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

మొదటి పేజీ తరువాయి భాగం..

పిలుపునిచ్చారు. అభివృద్దే లక్ష్యం.. ప్రజా సేవే ముఖ్యం కన్మనూరులో బీజేపీ క్షేత్రస్థాయిలో మరింత బలపడాలని ఎంపీ కార్యకర్తలకు నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఇంటికీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చూసే బాధ్యత కార్యకర్తలదేనని చెప్పారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అంబలి కేంద్రం ప్రారంభం

**ఆత్మకూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో మంగళవారం శ్రీ రామదూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఆంజనేయులు ఆధ్వ ర్యంలో మంగళవారం పేదల దాహార్తిని తీర్చేందుకు వేసవి కాలంలో ప్రతి సంవత్సరం మాదిరిగా అమలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లుగా వారుతెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్న నేపథ్యంలో శ్రీరామదూతా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఆత్మకూరులో అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లుగా వారు తెలిపారు. పట్టణంలోని కేబీఎస్ బ్యాంకుసమీపంలోఅంబలికేంద్రాన్ని ప్రారంభించారు.



ఆత్మకూరులో అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం